మాట్లాడుతున్న ములుగు అదనపు కలెక్టర్ సంపత్‌రావు

వయోవృద్ధుల హక్కులను గౌరవించాలి

అదనపు కలెక్టర్ సంపత్‌రావు

ములుగురూరల్, అక్టోబర్ 1 : వయోవృద్ధుల హక్కులను గౌరవించడం అందరి బాధ్యత అని అదనపు కలెక్టర్ సంపత్‌రావు అన్నారు. కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం మహిళా, శిశువు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లా సంక్షేమ అధికారి శిరీష అధ్యక్షతన అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వయోవృద్ధులు సమాజానికి అమూల్యమైన సంపద అని, వారి హక్కులను గౌరవించడం మన బాధ్యత అని అన్నారు. సమాజంలో ఉన్న నిర్లక్ష్యపూరితమైన భావాజాలాన్ని నిర్మూలించేందుకు ప్రభుత్వాలు వయోవృద్ధుల సంరక్షణ చట్టాన్ని 2007లో తీసుకువచ్చిందని తెలిపారు. సమాజంలో వ యోవృద్ధులకు సరైన ఆనందం దక్కాలం టే వారికి తమ కన్న బిడ్డల నుంచి ప్రేమ పూర్వకమైన పలకరింపు, వారి ఆరోగ్యం పై శ్రద్ధ చూపటం చాలా ముఖ్యమని తెలిపారు. తల్లిదండ్రుల నుంచి ఆస్తిని లాక్కొని వారిని పట్టించుకోని వారిపై కఠినంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. సంక్షేమ సం ఘం ద్వారా అందించిన సలహాలు, సూచనలను తప్పకుండా పాటించడంతోపాటు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని వివరించారు. అనంతరం వయోవృద్ధుల సంక్షేమంలో భాగంగా ప్రతిజ్ఞ చేయించారు. వారం రోజులపాటు వివిధ అంశాల్లో నిర్వహించిన క్రీడల్లో ప్రతిభ చూపిన వయోవృద్ధులకు బహుమతులు అందించి సంఘాల నాయకులను అదనపు కలెక్టర్ సన్మానించారు. కార్యక్రమంలో వయోవృద్ధుల సంఘం నాయకుడు జగన్నాథం, కస్తూర్బాగాంధీ వృద్ధాశ్రమం నిర్వాహకురాలు సామ్రాజ్యం, డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య, జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఓంకార్, సీడీపీవోలు మల్లీశ్వరీ, ప్రేమలత, ముత్తమ్మ, సీనియర్ అసిస్టెంట్లు మీర్జా బేగ్, పీ శంకర్, కే శంకర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, డీసీపీయూ, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

ఏటూరునాగారం, అక్టోబర్ 1 : మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు జరిగే అండర్-17 రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు మండలకేంద్రానికి చెందిన పైడాకుల రాజేశ్, జాడి రాధిక ఎంపికయ్యారు. ఉమ్మడి వరంగల్ జిల్లా టీం నుంచి వీరు పాల్గొననున్నారు. గత నెల 30న నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి వీరిద్దరు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని కోచ్ పర్వతాల కుమారస్వామి తెలిపారు.

ఉమ్మడి వరంగల్ ప్రత్యేకాధికారిగా వినయ్ కృష్ణారెడ్డి

హనుమకొండ, అక్టోబర్ 1: రాష్ట్రంలో పది ఉమ్మడి జిల్లాలకు ప్రత్యేక అధికారులుగా సీనియర్ ఐఏఎస్ అధికారులను నియమించింది. ఈ మేరకు రాష్ట్ర సర్కారు ఉత్తర్వులు జారీ చేసింది. అందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు ప్రత్యేక అధికారిగా హెచ్‌అండ్‌ఎఫ్‌డబ్ల్యూ శాఖ జాయింట్ సెక్రటరీ టీ వినయ్ కృష్ణారెడ్డిని నియ మించారు.

ఉత్పత్తి పెంచేలా అవగాహన : జీఎం

భూపాలపల్లి రూరల్, అక్టోబర్ 1 : గైర్హాజరు శాతాన్ని తగ్గించి ఉత్పత్తి పెంచేలా కార్మికులకు అవగాహన కల్పిస్తున్నట్లు సింగరేణి భూపాలపల్లి జీఎం సయ్యద్ హబీబ్ హుస్సేన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కారుణ్య నియామకాల ద్వారా సెప్టెంబర్‌లో 17 మంది డిపెండెంట్లకు ఉద్యోగాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. సెప్టెంబర్‌లో బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 3.59 లక్షల టన్నులు పెట్టుకోగా 2.11 లక్షల టన్నులు సాధించామన్నారు. అక్టోబర్‌లో లక్ష్యం 3.86 లక్షల టన్నులు పెట్టుకున్నామని, ఈ లక్ష్యాన్ని చేరుకోవడానికి అధికారులు, కార్మికులు సమష్టిగా కృషి చేయాలని ఆదేశించారు. కారుణ్య నియమకాలు వెనువెంటనే అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

ఈ నెల 7న అర్హులైన ఉద్యోగులకు బెటర్‌మెంట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని, ఒడిశా రాష్ట్రంలో జరిగిన కోలిండియా పోటీల్లో భూపాలపల్లికి చెందిన క్రీడాకారులు 2 బంగారు, 3 సిల్వర్, ఒక రజత పతకం సాధించినట్లు చెప్పారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOT FOR SALE

★హన్మకొండ KITS కాలేజీ, అంబాల రోడ్డుకు మరియు ముచ్చర్ల రోడ్డుకు కొత్తగా వస్తున్న హైవేకు దగ్గర్లో 466.66 గజాలు గల ప్లాటు (40x105) అమ్మకానికి కలదు. సంప్ర: సెల్: 9553255936
NTW-326316

CHANGE OF NAME
★I, KANTHA RAO VINAYAK RAO GANTI S/o GANTI VINAYAKA RAO, R/o. H.No. 5-10-135, Kishanpura, Hanamkonda, Hanumakonda-506001., Telangana, India have changed my name to KANTHA RAO GANTI and solemnly declare.
NTW-000

CHANGE OF NAME
★I, GANTI RAVI KUMAR KANTHA RAO S/o KANTHA RAO GANTI, R/o. H.No. 5-10-135, Kishanpura, Hanamkonda, Hanumakonda-506001., Telangana, India have changed my name to RAVI KUMAR GANTI and solemnly declare.
NTW-000

CHANGE OF NAME
★ I Potireddy Ravinder (old Name), H.No. 8-2-70/43A. Writer Basthi, Gollagudem, kothagudem Bhadradri kothagudem-507101, Telangana, India,have changed my name Potireddy Ravinder Reddy to Pothireddy Ravindar Reddy (New name), S/o Potireddy Papi Reddy.
NTW-000

CHANGE OF NAME
★I Potireddy ShriLata W/o Pothireddy Ravindar Reddy (old Name) H.No. 8-2-70/43A. Writer Basthi Gollagudem, kothagudem, Bhadradri kothagudem-507101, Telangana, India, have changed my name Potireddy ShriLata to Pothireddy Sri Latha W/o Pothireddy Ravindar Reddy (New Name).
NTW-000

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA 9182777563 9182777961
WARANGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

కాటారం : ఆదర్శ పాఠశాల ఆవరణలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు, ఉపాధ్యాయినులు

చిట్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..

మహదేవపూర్ : బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు

మల్హర్ : వల్లెకుంట పాఠశాలలో..

టేకుమట్ల : బతుకమ్మ సంబురాల్లో విద్యార్థులు

ఆడబిడ్డల ముందస్తు సంబురం

- పాఠశాలలు, కళాశాలల్లో బతుకమ్మ వేడుకలు
- ఆడిపాడిన విద్యార్థినులు, ఉపాధ్యాయినులు
- ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో వేడుకలు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్ : బతుకమ్మ పండుగ పురస్కరించుకొని మంగళవారం ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో ముందస్తు వేడుకలు నిర్వహించారు. ఉపాధ్యాయినులు, విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి తీరొక్క పూలతో బతుకమ్మలు పేర్చారు. కోలాటం ఆడుతూ, పాటలు పాడుతూ వేడుకలు జరుపుకున్నారు. ఉత్తమ బతుకమ్మలకు, సాంస్కృతిక ప్రదర్శనల విజేతలకు బహుమతులను అందజేశారు.తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి గౌరమ్మను పూజించడం తెలంగాణ సంస్కృతిలో భాగమని ఉపాధ్యాయులు వివరించారు.

భూపాలపల్లి రూరల్ : బతుకమ్మ వేడుకల్లో..

గణపురం : ముందస్తు బతుకమ్మ వేడకలు

వెంకటాపూర్ : బతుకమ్మలతో చిన్నారులు

వెంకటాపూర్ (నూగూరు) : బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు

గోవిందరావుపేట : చల్వాయి ప్రభుత్వ పాఠశాలలో..

మహాముత్తారం : ముందస్తు బతుకమ్మ సంబురాలు

వాజేడు : గుమ్మడిదొడ్డిలో బతుకమ్మ పేరుస్తున్న విద్యార్థులు, బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు

ములుగు రూరల్ : బహుమతులు అందజేస్తున్న పిచ్చిరెడ్డి

వెంకటాపూర్ : బతుకమ్మలతో విద్యార్థులు

సైబర్ నేరాలపై అవగాహన

గణపురం, అక్టోబర్ 1: సైబర్ నేరాలపై విద్యార్థి దశలోనే అవగాహన అవసరమని ఎస్సై రేఖ అశోక్ అన్నారు. మంగళవారం స్థానిక మోడల్ స్కూల్‌లో కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా పోలీసుశాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, డయల్ 100, ఈవ్ టీజింగ్, షీటీమ్స్, యాంటీ డ్రగ్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రొబెషనరీ ఎస్సైలు, ప్రిన్సిపాల్ తిరుపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్నికైన కమిటీ సభ్యులు

రామాలయం కమిటీ ఎన్నిక

ఏటూరునాగారం, అక్టోబర్ 1 : మండలకేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధి కమిటీని మంగళవారం ప్రజల సమక్షంలో ఎన్నుకున్నారు. చైర్మన్‌గా అలువాల శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా కిరణ్, రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా వినయ్, కోశాధికారిగా దీన బంధవస్వామి, ప్రచార కార్యదర్శులుగా సంతోష్, చంద్రశేఖర్, సిసింద్రీలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సభ్యులు ప్రసాద్, బ్రహ్మం, భిక్షపతి, రాంబాబు, అక్షిత్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీదేవిపేట గౌడ సంఘం అధ్యక్షుడిగా శంకర్

శంకర్‌గౌడ్

వెంకటాపూర్, అక్టోబర్ 1 : మండలంలోని లక్ష్మీదేవిపేట గ్రామ గౌడ సంఘం అధ్యక్షుడిగా గట్టు శంకర్‌గౌడ్ ఎన్నికయ్యారు. మంగళవారం గ్రామంలో లక్ష్మీదేవిపేట, నల్లగుంట, బూర్గుపేట గ్రామాలకు చెందిన గౌడ కులస్తుల సమక్షంలో ఎన్నికలు నిర్వహించగా శంకర్‌గౌడ్ వరుసగా రెండోసారి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా మేరుగు మల్లయ్య, డైరెక్టర్లుగా బుర్ర సదానందం, బుర్ర అశోక్, వీరగాని రమేశ్, మామిండ్ల సంపత్, పెరుమాండ్ల విక్రమ్, శంకర్, రవి, రాజు, తిరుపతి, ఓదెలు, హరీశ్, గణేశ్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గట్టు కుమారస్వామి, రాజయ్య, యాదగిరి, సతీశ్, సదయ్య, రమేశ్, వీరయ్య పాల్గొన్నారు.

పశువైద్యాధికారుల సంఘం ఉపాధ్యక్షుడిగా రమేశ్


రమేశ్

ములుగురూరల్, అక్టోబర్ 1 : తెలంగాణ రాష్ట్ర పశువైద్యాధికారుల సంఘం ఉపాధ్యక్షుడిగా మల్లంపల్లి గ్రామ పశువైద్యాధికారి వడ్డెపల్లి రమేశ్ ఎన్నికయ్యారు. గతంలో వరంగల్ జిల్లా పశు వైద్యాధికారుల సంఘం అధ్యక్షుడిగా రమేశ్ పనిచేశారు.

పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలి

కాటారం, అక్టోబర్ 1 : కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్ నియోజక వర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాల్గొనేందుకు పట్టభద్రులంతా ఓటరు నమోదు చేసుకోవాలని తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ బండారి రాజ్‌కుమార్ కోరారు. మండలకేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడారు. తాము ఇటీవల తెలంగాణ గ్రాడ్యుయేట్స్ ఫోరం ఏర్పాటు చేశామని, ఇందులో భాగంగా నాలుగు జిల్లాల్లో కలిపి 42 నియోజకవర్గాలలో 42 మంది కో-ఆర్డినేటర్లను నియమించి ఓటరు నమోదుకు విస్తృత ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ఐదు లక్షల ఓటర్ల నమోదే లక్ష్యంగా విస్తృతంగా పర్యటిస్తూ తీవ్ర కృషి చేస్తున్నామన్నారు.

పరిసరాల శుభ్రతతోనే మానసిక ఆరోగ్యం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి నారాయణబాబు

కార్మికులను సన్మానిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

కృష్ణకాలనీ, అక్టోబర్ 1 : పరిసరాలు శుభ్రంగా ఉంటే మానసిక ఆరోగ్యం బాగుంటుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యా య సేవాధికార సంస్థ చైర్మన్ పీ నారాయణ బాబు అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని పురస్కరించుకొని మంగళవారం జిల్లా కోర్టు ప్రాంగణం నుంచి అంబేద్కర్ సెంటర్ మీదుగా తిరిగి జిల్లా కోర్టు వరకు న్యాయ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భం గా ఏర్పాటు చేసిన సమావేశంలో జడ్జి మాట్లాడారు. నిత్యం మనందరి కోసం శ్రమిస్తున్న పారిశుధ్య కార్మికులను గౌరవించాలని సూచించారు. అనంతరం పారిశుధ్య కార్మికులను జడ్జి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కే జయరాంరెడ్డి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎన్ రామచంద్రారావు, బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కూనూరి సురేశ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి బల్ల మహేందర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఏదులాపురం శ్రీనివాస్,కోర్టు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

భూపాలపల్లి రూరల్, అక్టోబర్ 1 : జిల్లాలో అర్హులైన ఎస్సీ విద్యార్థులు పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనానికి, నూతన మార్గదర్శకాల ప్రకారం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి సునీత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు ప్రక్రియలో డెమో అథెంటికేషన్, బయో మెట్రిక్ అథెంటికేషన్, రిజిస్ట్రేషన్ మూడు దశలు ఉంటాయని తెలిపారు. మొదటి దశలో ఈ-పాస్ వెబ్‌సైట్‌లో నూతన, రెన్యూవల్ రిజిస్ట్రేషన్‌లో భాగంగా విద్యార్థి ఆధార్ కార్డ్ నంబర్ సమర్పించి టెన్త్ మెమోలోని వివరాలతో సరి చేసుకోవాల్సి ఉంటుందన్నారు. తదుపరి దశలో బయోమెట్రిక్ అథెంటికేషన్ చేయాలని. ఒకవేళ వివరాలు సరిగా లేకుంటే సంబంధిత విద్యార్థి తన ఆధార్ వివరాలను మీ సేవ కేంద్రంలో అప్‌డేట్ చేయాల్సిఉంటుందన్నారు.

మూడో దశలో ధ్రువపత్రాలను అప్లోడ్ చేసి ఉపకార వేతన వివరాలు పూర్తిగా నింపి దరఖాస్తును సమర్పించాలని, ఒకవేళ ఆధార్ ఫీడ్ కాకపోతే వెంటనే సంబంధిత బ్యాంక్‌లో సంప్రదించాలన్నారు. మూడు దశల్లో దరఖాస్తు ప్రక్రియ పూ ర్తయిన తర్వాత కళాశాల ప్రిన్సిపాల్‌కు దరఖాస్తు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. కళాశాల యాజమాన్యాలు ఎస్సీ విద్యార్థులకు సూచనలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. వివరాలకు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో సంప్రదించవచ్చని ఆమె సూచించారు.

విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

జాతీయస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

చిట్యాల (మొగుళ్లపల్లి), అక్టోబర్ 1 : మొగుళ్లపల్లి మండలకేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం విజయ్‌పాల్ రెడ్డి తెలిపారు. సెప్టెంబర్ 18న కరీంనగర్ జిల్లాలోని కురిక్యాల గ్రామంలో ఎస్సార్ ప్రైమ్ స్కూల్ ఆవరణలో జరిగిన షూటింగ్ బాల్ సబ్ జూనియర్ బాలబాలికల రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో పాఠశాలకు చెందిన శివాజీ, వినయ్ అత్యుత్తమ ప్రతిభ కనబర్చినట్లు చెప్పారు. ఎంపికైన విద్యార్థులు నవంబర్ 2న బీహార్‌లోని గయాలో జరిగే జాతీయ స్థాయి క్రీడల్లో తెలంగాణ జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పీడీ గుండెల్లి రాజయ్య, విద్యార్థులను ఉపాధ్యాయలు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాగ్యశ్రీ, వెంకన్న, సురేందర్, కల్యాణి, అనిల్‌కుమార్, రాజు, కుమారస్వామి, ప్రవీణ్, లలిత, పద్మ, విజయ భాస్కర్, చందర్ పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక బలోపేతానికే మిల్లెట్ ప్రాసెసింగ్

- యూనిట్ పునః ప్రారంభానికి చర్యలు
- భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ

గణపురం, అక్టోబర్ 1: మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికే మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్‌ను పునః ప్రారంభిస్తున్నట్లు కలెక్టర్ రాహుల్‌శర్మ తెలిపారు. మండలంలోని చెల్పూర్ శివారులో మహిళా గ్రామ సమాఖ్య సంఘం సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్‌ను మంగళవారం కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. చిరు ధాన్యాలతో చేసిన ఆహారాన్ని రుచి చూసి సభ్యులను అభినందించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ చెల్పూరులో ఏర్పాటు చేసిన మహిళా మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్‌ను పునః ప్రారంభించాలని తెలిపారు. రూ.65 లక్షలతో యూనిట్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం మార్కెట్‌లో మిల్లెట్స్‌కు డిమాండ్ ఉందని, మిల్లెట్ల ద్వారా తయారు చేసిన తినుబండారాలను మార్కెట్‌లో విక్రయించొచ్చని తెలిపారు. ప్రభుత్వం తరఫున యూనిట్ నిర్వహణకు సహకారం అందిస్తామన్నారు. ఆహార వస్తువులు జిల్లాలోని ప్రభుత్వ వసతి గృహాలు, మహిళా శక్తి కాంటీన్లకు సరఫరా, మార్కెటింగ్ సౌకర్యం కల్పనకు చర్యలు తీసుకోవాలని డీఆర్డీవోకు సూచించారు.

మహిళా సమాఖ్య మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

స్వచ్ఛతా హీ సేవలో భాగస్వాములు కావాలి

జిల్లాను స్వచ్ఛత వైపు నడిపించేందుకు ప్రజలందరూ స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కలెక్టర్ రాహుల్‌శర్మ పిలుపునిచ్చారు. మంగళవారం చెల్పూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకు స్వచ్ఛతపై భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. స్వచ్ఛత పరిశుభ్రత కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని పిలుపునిచ్చారు. ప్రతి కుటుంబం తప్పని సరిగా మరుగుదొడ్డి వినియోగించాలని, ఆరుబయట మల, మూత్ర విసర్జన చేయడం సామూహిక నేరమన్నారు. ప్రతి విద్యార్థి వారి అమ్మ పేరుతో ఒక మొక్క నాటాలని సూచించారు. కార్యక్రమానికి ముందు కలెక్టర్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులతో కలిసి మానవహారం నిర్వహించి, పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీపీవో నారాయణరావు, డీఆర్డీవో అవినాష్, డీపీఎం రవి, ఎస్బీఎం కో ఆర్డినేటర్లు వెంకటేశ్, ఎంపీడీవో భాస్కర్, పంచాయతీ కార్యదర్శులు హరిచంద్రారెడ్డి, ముక్కెర హేమంత్, ఏపీవో రాజు, ఏపీఎం ఇమామ్ పాల్గొన్నారు.

'ఆరోగ్య మహిళ'ను తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో

వెంకటాపూర్, అక్టోబర్ 1 : మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లం అప్పయ్య మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన డాక్టర్ రిషిత ఆధ్వర్యంలో ఆరోగ్య మహిళ కార్యక్రమానికి వచ్చిన రోగుల సేవలను అడిగి తెలుసుకున్నారు. హాజరు పట్టిక, ఓపీ స్టాక్ రిజిస్టర్లను, మెడిసిన్ స్టోర్ రూమ్‌లను పరిశీలించి, చికిత్స పొందుతున్న రోగుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చందన, ఫార్మాసిస్ట్ రాజమణి, స్టాఫ్ నర్స్ మున్నమ్మ పాల్గొన్నారు.

3న అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం

కృష్ణకాలనీ, అక్టోబర్ 1 : కలెక్టర్ కార్యాలయం (ఐడీవోసీ) మీటింగ్ హాల్‌లో ఈనెల 3న అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి కే చిన్నయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని వయోవృద్ధులు, జిల్లా అధికారులు, ఇతర కార్యాలయ సిబ్బంది హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సమావేశాలు నిర్వహించాలి

ములుగురూరల్, అక్టోబర్ 1 : ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ సమావేశాలను వెంటనే నిర్వహించాలని కమిటీ జిల్లా సభ్యుడు చుంచు రవి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రతి మూడు నెలలకు ఒక సారి కలెక్టర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించాల్సి ఉండగా 14నెలల నుంచి సమావేశాలను నిర్వహించలేదని అన్నారు. ప్రతి నెలా 30వ తేదీన రెవెన్యూ, పోలీస్ సిబ్బంది సివిల్ రైట్స్ దినంపై సమావేశం నిర్వహించి అవగాహన కల్పించాలని అన్నారు.

ఇల్లు కూలిన కుటుంబానికి సాయం

మంగపేట, అక్టోబర్ 1 : మండలకేంద్రంలోని పొదుమూరులో ఇటీవల కురిసిన వర్షాలకు దాగం సత్యనారాయణ ఇల్లు కూలిపోగా మంగళవారం బాధిత కుటుంబానికి మండలం నాయీ బ్రాహ్మణ సేవా సంఘం తరఫున రూ.16వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు ఓదెల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు దామెరకుంట రవి, ప్రధాన కార్యదర్శి ఎనగందల శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సెంటర్ పరిశీలన

ఏటూరునాగారం, అక్టోబర్ 1 : మండల పరిధిలోని మల్యాల అంగన్‌వాడీ సెంటర్‌ను వైద్యాధికారి ప్రణీత్‌కుమార్ పరిశీలించారు. చిన్నారులకు పోషకాలతో కూడిన సమతుల ఆహారాన్ని అందించాలని సూచించారు. వయసుకు తగిన ఎత్తు, బరువు పెరగాలంటే పౌష్టికాహారం ఎంతో అవసరమన్నారు. హెల్త్ అసిస్టెంట్ భాస్కర్‌రావు, అంగన్‌వాడీ టీచర్ సుభాషిని, ఆశ వర్కర్లు జ్యోతి, లక్ష్మి పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు

గోవిందరావుపేట, అక్టోబర్ 1 : మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని పస్రా ఎస్సై అచ్చా కమలాకర్ అన్నారు. పస్రా చౌరస్తాలో ఆయన వాహనాల తనిఖీ, డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టారు. తాగి వాహనాలు నడిపితే కేసులు తప్పవని హెచ్చరించారు. వాహనదారులు పూర్తి కాగితాలు కలిగి ఉండాలని సూచించారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

ములుగురూరల్, అక్టోబర్ 1 : ములుగు ఎంఈవో సామల శ్రీనివాసులు మంగళవారం మండలంలోని మంచినీళ్లపల్లి ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. దసరా సెలవులలో విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించేందుకు తల్లిదండ్రులు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దిలీప్, ఉపాధ్యాయుడు పూర్ణచందర్ ఉన్నారు.

విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి

తాడ్వాయి, అక్టోబర్ 1 : విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు మంగళవారం జనరల్ నాలెడ్జ్ పుస్తకాలను అందజేశారు. దసరా పండగను పుర్కరించుకుని 12పాఠశాలలకు చెందిన సుమారు 1103మంది విద్యార్థులకు ఆయా పాఠశాలల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో జీకే పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు. సెలవులను వృథా చేయకుండా ఇష్టంగా చదువుకోవాలని సూచించారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

భూపాలపల్లి రూరల్, అక్టోబర్ 1 : భూపాలపల్లి మున్సిపల్ పరిధి కాసింపల్లి గ్రామంలో విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. చల్లూరి రంజిత్ (34) మంగళవారం ఉదయం ఇంటి ఎదుట ఉన్న బోరు వద్ద మొహం కడుక్కుంటున్న క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని 100 పడకల దవాఖానకు తరలించారు.

బైక్ అదుపు తప్పి ఒకరు..

భూపాలపల్లి రూరల్, అక్టోబర్ 1 : భూపాలపల్లి మండలం కమలాపూర్ సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మహాముత్తారం మండలం గండికామారం (చింతలపల్లి) గ్రామానికి చెందిన ఐరెడ్డి శ్రావన్‌రెడ్డి (35) మంగళవారం ఉదయం భూపాలపల్లి పట్టణానికి వచ్చి బైక్‌పై తిరిగి వెళ్తున్నాడు. ఈ క్రమంలో కమలాపూర్ సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కనున్న గుంతలో పడి మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని కేసు నమోదు చేసి, మృతదేహాన్ని భూపాలపల్లి 100 పడకల దవాఖానకు తరలించారు.

తగ్గుతున్న గోదావరి నీటిమట్టం

కన్నాయిగూడెం, అక్టోబర్ 1 : మండలంలోని తుపాకులగూడెం సమ్మక్క బరాజ్ వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా తగ్గుతున్నది. మంగళవారం ఎగువనుంచి 2రెండు లక్షల 49వేల720 క్యూసెక్కుల వరదనీరు వస్తున్నట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. బరాజ్ మొత్తం 59 గేట్లను ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు వదులుతున్నారు. బరాజ్ పూర్తిస్థాయి నీటిమట్టం 83మీటర్లు, ప్రస్తుతానికి గోదావరి నీటిమట్టం 76.50మీటర్ల ఎత్తులో ప్రవహిస్తోంది.

మూడు మోటర్లతో దేవాదుల పంపింగ్

దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టులోని ఫేజ్-3లోని రెండు మోటర్లతో గోదావరి నీటిపంపింగ్ కొనసాగుతుండగా మరో మోటర్ ఆన్ చేశారు. మూడు మోటర్ల ద్వారా రోజుకు 875క్యూసెక్కుల నీటిని భీంఘణపురం రిజర్వాయర్‌లోకి తరలిస్తున్నట్లు నీటిపారుదలశాఖ డీఈ శరత్, ఏఈఈ సాయిరాం తెలిపారు.

70మందికి కంటి ఆపరేషన్లు

ములుగురూరల్, అక్టోబర్ 1 : తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపట్టిన మెగా కంటి వైద్య శిబిరంలో అవసరం ఉన్న 70మందికి హైదరాబాద్ శంకర కంటి హాస్పిటల్‌లో ఆపరేషన్ చేయించినట్లు జంపన్న చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు భూక్యా జంపన్న తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆపరేషన్ పూర్తి అయిన వారిని ప్రత్యేక బస్సులో ములుగుకు తీసుకువచ్చినట్లు తెలిపారు. రూపాయి ఖర్చు లేకుండా ఉచిత ప్రయాణం, భోజన వసతి కల్పించినట్లు తెలిపారు.

కంటి ఆపరేషన్ అయిన వారితో జంపన్న